


తెలుగు సాహిత్య విమర్శకు ఒరవడి దిద్దిన 'రారా'

ప్రజాశక్తి - కడప అర్బన్ : తెలుగు సాహిత్య లోకంలో 'రారా'గా ప్రసిద్ధులైన రాచమల్లు రామచంద్రారెడ్డి' సంవేదన' తెలుగు త్రైమాసిక పత్రిక సంపాదకులుగా తెలుగు సాహిత్య విమర్శకు నూతన ఒరవడిని దిద్దారని వైఎస్ఆర్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అన్నారు. శుక్రవారం కడప రెడ్డి సేవా సమితి రారా 103వ జయంతిని ఘనంగా నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ రారా తన విమ ర్శతో, అనువాదాలతో, పాత్రికేయ రచనలతో తెలుగు సాహిత్యానికి ఎంతో దోహదం చేశారన్నారు. కడప రెడ్డి సేవా సమితి ప్రధాన కార్యదర్శి లెక్కల కొండారెడ్డి మాట్లా డుతూ రారా వీరేశలింగం, గురజాడ, శ్రీశ్రీ వంటి ఉద్దండుల రచనలపై ప్రామా ణికమైన విమర్శలు చేశారని, కార్యక్రమంలో అధ్యక్షులు డాక్టర్ కుప్పిరెడ్డి నాగిరెడ్డి, ఆంధ్రప్రదేశ్ అధికార భాష సంఘం పూర్వ సభ్యులు డాక్టర్ తవ్వా వెంకటయ్య, విశ్రాంత ఉపాధ్యాయులు కొండా చెంచి రెడ్డి, మాచిరాజు రమణయ్య పాల్గొన్నారు.

విదిలింపులే!

- 'ఉక్కు' పరిశ్రమ ఊసేదీ
- మామిడి క్లస్టర్‌లో అన్నమయ్య జిల్లా
- డ్వాక్రా మహిళల రుణ ప్రస్తావన కరువు
- రూ.488.56 కోట్లతో జిఎన్ఎస్ఎస్ పనులు
- రూ.3,245 కోట్లతో హెచ్ఎన్ఎస్ఎస్ కేటాయింపు



రాష్ట్ర బడ్జెట్

2025-26 విదిలింపులకు పరిమితమైంది. జిల్లా ప్రగతి చోదక శక్తులైన నీటిపారుదల, వ్యవసాయం, పారిశ్రామిక, సేవల రంగాల కేటాయింపులను పరిశీలిస్తే నిరాశను కలిగించింది. రూ.4,454 కోట్లతో సాగునీటి ప్రాజెక్టులకు కేటాయింపులు, మామిడి క్లస్టర్ జిల్లాల జాబితాలో అన్నమయ్య జిల్లాకు చోటు దక్కడం స్వల్ప ఉపశమనం కలిగించడం మినహా వ్యవసాయ, పారిశ్రామిక కేటాయింపులు నిరాశను మిగిల్చాయని చెప్పవచ్చు. జిల్లా జీవనాడియైన ఉక్కు పరిశ్రమ ఏర్పాటు, కొప్పర్తి ఎంఎస్ఎంఇల పురోగతికి సంబంధించి ఎటువంటి ప్రస్తావన చేయలేదు. వైఎస్ఆర్ ఎలక్ట్రానిక్ క్లస్టర్‌లో పరిశ్రమల ఏర్పాటుకు మౌళిక సదుపాయాల కల్పనను విస్మరించింది. డ్వాక్రా మహిళలకు రుణాలు, ఫీజురియింబర్స్‌మెంట్, తల్లికివందనం నిరుద్యోగ భృతి తదితర సంక్షేమ పథకాల వ్యయాల్ని సైతం నిర్లక్ష్యం చేసినట్లు కనిపిస్తోంది.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

రాష్ట్ర ఆర్థిక శాఖా మంత్రి పయ్యావుల కేశవ్ శుక్రవారం రూ.3,22,359 కోట్లతో 2025-26 వార్షిక బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. ఉమ్మడి జిల్లాకు సంబంధించిన కీలక రంగాల కేటాయింపులను పరిశీలిస్తే తీవ్రనిరుత్సాహాన్ని కలిగించింది. కడప, కర్నూలు, చిత్తూరు జిల్లాల పరిధిలోని ప్రాజెక్టులకు రూ.4,454 కోట్లతో కూడిన సాగునీటి పారుదల రంగ కేటాయింపులు ఉపశమనం కలిగించాయని చెప్పవచ్చు. 2023-24 బడ్జెట్‌లో సాగు నీటిపారుదల రంగానికి రూ.3,800 కోట్లు కేటాయించిన సంగతి తెలిసిందే. 2025-26 బడ్జెట్‌లో రూ.4,454 కోట్లు కేటాయింపులు చేసింది. హెచ్ఎన్ఎస్ఎస్‌కు 3,243 కోట్లు, జిఎన్ఎస్ఎస్‌కు రూ.488 కోట్లు, కెసికి రూ.183.85 కోట్లు, టిజిపి రూ.345 కోట్లు, పిబిసికి రూ.170 కోట్లు, వెలిగల్లుకు రూ.ఐదు కోట్లు, లోయర్ సగిలేరు రూ.20 కోట్లు, మైలవరానికి రూ.35 లక్షలు కేటాయించింది. ప్రస్తుత బడ్జెట్‌లో జిల్లా జీవనాడియైన ఉక్కు పరిశ్రమ ప్రస్తావనే చేయలేదు. 2022-23 బడ్జెట్‌లో యోగివేమన యూనివర్శిటీకి రూ.32.83 కోట్లు, సిపిబ్రౌన్‌కు రూ.10 లక్షల చొప్పున కేటాయించిన సంగతి తెలిసిందే. ప్రస్తుత బడ్జెట్‌లో యోగివేమన, ఆర్కిటెక్చర్ యూనివర్శిటీ, ఎపికార్ల్ విద్యా, పరిశోధక సంస్థల ప్రస్తావన కనిపించలేదు. అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.10 వేల కోట్లు కేటాయింపులు చేయాల్సి ఉండగా, రూ.6,300 కోట్లు కేటాయింపులు చేయడం విమర్శలకు ఆస్కారాన్ని కలిగిస్తోంది. కడప, అన్నమయ్య జిల్లాలకు చెందిన సుమారు ఏడు లక్షల మంది విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది. నాలుగు నెల బడ్జెట్‌లో తల్లికివందనం పథకానికి రూ.ఐదు వేల కోట్లు కేటాయించినప్పటికీ రూపాయి ఖర్చు చేయని నేపథ్యం ఆందోళన కలిగిస్తోంది. నాలుగు నెల కిందటి బడ్జెట్‌లో సున్నా వడ్డీ పథకానికి రూ.687 కోట్లు కేటా యించగా, తాజా బడ్జెట్‌లో రూ.250 కోట్లు కేటాయించింది. ఉమ్మడి జిల్లాలోని 4.80 లక్షల మంది రైతులకు అన్నదాత సుఖీభవ పథకం అమలు ప్రకటనతో స్వల్ప ఊరట లభించింది. ప్రతికౌలు రైతుకూ ఏడాదికి రూ.20 వేలు పంపిణీ చేయ నుంది. ఉమ్మడి జిల్లాలో ఏడు నుంచి 14 వేల మంది కౌలు రైతులకు లబ్ధి చేకూరనుందని చెప్పవచ్చు. ఉమ్మడి జిల్లాలోని గండికోట డిస్ట్రిబ్యూటరీలు, అన్నమయ్య రిజర్వాయర్ పునరుద్ధరణ, కాలేటివాగు, పింఛా, ఎల్ఎస్‌పి, నిలిచిపోయిన కుందూ-పెన్నా, కాలేటివాగు ఎత్తిపోతల పథకాల పనులకు సంబంధించిన కేటాయింపుల ప్రస్తావన చేయలేదు.

ఆత్మస్తుతి పరనిందలే అధికం



బడ్జెట్‌లో చంద్రబాబు, లోకేష్, పవన్‌లపై పొగడ్తలను గమనిస్తే ఆత్మస్తుతి పరనిందలే అధికంగా కనిపిస్తున్నాయి. రూ.79 వేల లోటును ఎక్కడ నుంచి పూడ్చుకోవాలో చెప్పాల్సిన అవసరం ఉంది.బడ్జెట్ కూర్పును గమనిస్తే అంకెల గారడీని తలపి స్తోంది.

- జి.చంద్రశేఖర్, సిపిఎం జిల్లా కార్యదర్శి, కడప.

పాఠశాల విద్యకు 20 శాతం నిధులు కేటాయించాలి



ప్రభుత్వ విద్యా రంగం అభివృద్ధికి రాష్ట్ర బడ్జెట్లో 20శాతం నిధులు కేటాయించాలి. కొఠారి కమిషన్ చెప్పిన దానిని పట్టించుకోకుండా రాష్ట్ర ప్రభుత్వం 2025-26 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన బడ్జెట్లో పాఠశాల విద్యాశాఖకు 9.86శాతం మాత్రమే నిధులను కేటాయించడం పట్ల యుటిఎఫ్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇలా తక్కువ కేటాయింపులు చేయటం వల్ల ప్రభుత్వ విద్యారంగ బాధ్యత నుంచి ప్రభుత్వం వైదొలగుతున్నదనే భావన ఏర్పడుతుంది.

-బి.లక్ష్మిరాజా, యుటిఎఫ్ రాష్ట్రకార్యదర్శి.

జిల్లాకు తీరని అన్యాయం



బడ్జెట్‌లో జిల్లాకు తీరని అన్యాయం చేశారు. రాయలసీమతోపాటు నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు వరదాయినియైన హంద్రీ నీవా, తెలుగుగంగ, రాజోలి, వెలుగొండ ప్రాజెక్టులకు బడ్జెట్‌లో 10 శాతం నిధులు కేటాయించాలి. **- గాలి, చంద్ర, సిపిఐ జిల్లా కార్యదర్శి, కడప.**

ప్రజావ్యతిరేక బడ్జెట్



బడ్జెట్ పేద, మధ తరగతి ప్రజలకు వ్యతిరేక బడ్జెట్. ధరల స్థిరీకరణ నిధి కేటాయింపులను గమనిస్తే భవిష్యత్‌లో ధరలు బాధడం ఖాయమనిపిస్తోంది. ఇటువంటి నిరుత్సాహ బడ్జెట్‌ను ఎప్పుడూ చూడ లేదు.

- ఎన్.డి.విజయజ్యోతి, డిసిసి అధ్యక్షులు, కడప.

ఎన్నికల హామీలు గాలికి



బడ్జెట్‌లో ఎన్నికల హామీలను గాలికి వదిలేసింది. నిరుద్యోగులను దగా చేసింది. మహిళా శక్తి, ఉచితబస్సు, తల్లికివందనం, అన్నదాతా సుఖీ భవ, దీపం వంటి సంక్షేమ పథకాలకు కోత పెట్టడం ఆందోళనకరం.

- పి.రవీంద్రనాథరెడ్డి, వైసిపి జిల్లా అధ్యక్షులు, కడప.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- 13 సమస్యాత్మక కేంద్రాలు గుర్తింపు
- పరీక్షలు రాయనున్న 32 ,885 మంది విద్యార్థులు



ప్రజాశక్తి - కడప అర్బన్

ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ఈ నెల 1 నుంచి 20వరకు కొనసాగనున్నాయి. జిల్లాలో 152 జూనియర్ కళాశాలలకు చెందిన విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. జిల్లాలో మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యను అభ్యసిస్తున్న 32,885 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. ఇందులో రెగ్యుల్, ఒకేషన్ విద్యార్థులు ఉన్నారు. వీరి కోసం 64 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ, ఎయిడెడ్ జూనియర్ కళాశాలలు 26, ప్రయివేట్, అన్‌ఎయిడెడ్ జూనియర్ కళాశాలలు 38 ఉన్నాయి. 13 పరీక్షా కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలు గుర్తించారు. అన్ని కేంద్రాల్లో సిసి కెమెరాలను ఏర్పాటు చేశారు. మొదటి సంవత్సరం రెగ్యులర్ విద్యార్థులు 15,781 మంది, ఒకేషనల్ విద్యార్థులు 1,333 మంది, మొత్తం 17,114 మంది పరీక్షలకు హాజరు కానున్నారు. అలాగే ద్వితీయ సంవత్సరం రెగ్యులర్ విద్యార్థులు 14,589 మంది, ఒకేషనల్ విద్యార్థులు 1,132 మంది, మొత్తం 15,771 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరం మొత్తం విద్యార్థులు 32,885 మంది పరీక్షలకు హాజరు కానున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు ఉంటాయి. విద్యార్థులు అరగంట ముందే పరీక్షా కేంద్రాల వద్దకు చేరుకోవాలి. విద్యార్థులకు సమస్యలు, సందేహాలు ఉంటే నివృత్తి చేసుకునేందుకు కంట్రోల్ నంబరు 08562-244171 సంప్రదించాలని అధికారులు సూచించారు. పరీక్షల నిర్వహణపై ఆర్ఐఒ బండి వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ జిల్లాలో 3 ఫ్లయింగ్, 10 సిట్టింగ్ స్క్వాడ్స్ ఏర్పాటు చేశామని తెలిపారు. 64 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 64 డిపార్టుమెంటల్ అధికారులను నియమించామని చెప్పారు. ఎలాంటి మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా చర్యలు తీసుకున్నామన్నారు.



పరీక్ష కేంద్రంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఆర్ఐఒ వెంకటసుబ్బయ్య

144 సెక్షన్ అమలు

పరీక్ష కేంద్రాల వద్ద అధికారులు 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. గుంపులుగా ఎవరూ ఉండ కూడదని పోలీసులు హెచ్చరించారు.

సౌకర్యాల కల్పన

తాగునీటి వసతి, అత్యవసర మందులు, ఒఆర్ఎస్ ప్యాకెట్లు, ప్రథమ చికిత్స కేంద్రం ఏర్పాటు చేయాలని కలెక్టర్ శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

అందుబాటులో ఆర్‌టిసి బస్సులు

విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు అరగంట ముందే ఉండేలా ఆర్‌టిసి బస్సులను నడపాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పరీక్షకు వచ్చే, పూర్తయిన తరువాత బస్సులను విద్యార్థులకు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు.

జిరాక్స్ సెంటర్ల మూసివేత

పరీక్ష కేంద్రాలకు సమీపంలో ఉన్న జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని పోలీస్ శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేసింది.

పరీక్షా కేంద్రాల వద్ద ప్రత్యేక నిఘా

ప్రభుత్వ ఆదేశాల మేరకు పరీక్షా కేంద్రాల వద్ద ప్రత్యేక నిఘా ఉంచారు. అన్ని పరీక్షా కేంద్రాలతో కలిపి 950 సిసి కెమెరాలు ఏర్పాటు చేశారు. వీటిని ఆన్‌లైన్ స్ట్రీమింగ్ చేశారు. పరీక్షా కేంద్రాలలో విద్యార్థులు పరీక్షలు ఎలా రాస్తున్నారనే విషయాన్ని అటు బోర్డు నుంచి ఇంటర్మీడియట్ అధికారులు, ఇటు జిల్లా అధికారులు నిరంతరం పర్యవేక్షించనున్నారు. ఈ పరీక్షలకు సంబంధించిన ప్రశ్నాపత్రాలను పోలీసు బందోబస్తు నడుమ స్టోరేజ్ పాయింట్లలో భద్రపరిచారు.

- బండి వెంకటసుబ్బయ్య,ఆర్ఐఒ

ఎగుమతి సామర్థ్యాన్ని పెంచేందుకు కృషి : కలెక్టర్

ప్రజాశక్తి కడప అర్బన్ : జిల్లాలో పారిశ్రామిక, ఉద్యాన పంటల ఉత్పత్తుల ఎగుమతుల సామర్థ్యాన్ని పెంచే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని బోర్డు రూం మీటింగ్ హాల్లో జిల్లా పారిశ్రామిక ఎగుమతులు, ప్రోత్సాహక కమిటీ (డిఐఈపిసి)సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పారిశ్రామిక రంగాన్ని పటిష్టం చేసి మరింత విస్తృత పరిచేందుకు అన్ని అనుబంధ శాఖలు సమన్వయంతో జిల్లా ఆర్థిక ప్రగతికి ఆయువు పట్టు ఆయన పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకురావాలని సూచించారు. రాష్ట్రంలో పారిశ్రామిక పెట్టుబడుల ప్రోత్సాహకాన్ని పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు.జిల్లాలో పరిశ్రమల స్థాపనతో ఎక్కువమందికి ఉపాధి అవకాశాల ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు ఎస్సీ, ఎస్టీ ఔత్సాహిక నూతన పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు ప్రోత్సహించాలన్నారు. కొప్పర్తి పారిశ్రామిక వాడలో మౌలిక వసతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పారిశ్రామికవేత్తలకు సహాయ సహకారాలు అందించాలన్నారు. సమావేశంలో పరిశ్రమల శాఖ జిఎం చాంద్ బాషా, ఎపిఐఐసిజెడ్ఎం శ్రీనివాసమూర్తి, నగర కమిషనర్ మనోజ్ కుమార్ రెడ్డి, పీడీలు, వాణిజ్య పన్నుల శాఖ అధికారులు పాల్గొన్నారు.

అభ్యర్థులకు న్యాయం చేయాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి- జమ్మలమడుగు రూరల్ : ఉద్యోగాలు పేరుతో మోసపోయిన అభ్యర్థులకు న్యాయం చేసి, మోసం చేసిన ఎజెంట్లపై చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం అభ్యర్థులతో కలిసి జమ్మలమడుగులోని స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేంలో ఆయన మాట్లాడారు. కడపకు చెందిన ఆది రవికుమార్ అనే ఎజెంట్ 2024 సంవత్సరం జులై నెలలో సిసిడిఒ పోస్టుల పేరుతో సెంట్రల్ గవర్నమెంట్ జాబ్ పేరుతో జూనియర్ కళాశాలలో, మెడల్ స్కూల్ కళాశాలలో ఉద్యోగాలు ఇప్పిస్తామని ఒక్కరి దగ్గరి నుంచి రూ. 4 లక్షల నుచి రూ. 6 లక్షల వరకు వసూలు చేశారన్నారు. జిల్లాలో సుమారు 21 మంది వరకు రవికుమార్ కుడబ్బులు చెల్లిచారన్నారు. అభ్యర్థులు జూనియర్ కళాశలలో చేరిన తర్వాత అధికారులు ఫేక్ ఉద్యోగాలు అని చెప్పడంతో మోసపోయామని గ్రహించి అభ్యర్థులు డబ్బులు వాపసు ఇవ్వమని ఎజెంట్‌ను కోరారని చెప్పారు. డబ్బులు లేవని చెప్పి తిరిగి తనే అభ్యర్థులను బెదిరించారని చెప్పారు. కేవలం జమ్మలమడుగు, కడప జిల్లాలోనే కాదని ఇతర జిల్లాలోనూ ఇదే పరిస్థితన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి డబ్బులు రికవరీ చేసి బాధితులకు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో భాదిత అభ్యర్థులు పాల్గొన్నారు.

ఉర్దూ కవికి సన్మానం



కవిని సన్మానిస్తున్న అప్జల్‌ఖాన్

ప్రజాశక్తి - కడప : నగరంలోని రాజారెడ్డి వీధిలో ఉన్న అప్జల్‌ఖాన్ కార్యాలయంలో ప్రపంచ ప్రఖ్యాత ఉర్దూ కవి ,రచయిత సయ్యద్ నజర్ కాంగ్రెస్ పార్టీ కడప నగర అధ్యక్షులు అఫ్జల్ ఖాన్‌ను శుక్రవారం మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఉర్దూ కవి నజర్ గతంలో అయన రచించిన 4 ఉర్దూ పుస్తకాలల్లో 3 పుస్తకాలను ఇది వరకే విడుదల చేశారన్నారు. రానున్న కాలంలో నాల్గవ పుస్తకాన్ని ఉర్దూలోనే హిందీలోనూ అనువదిస్తున్నారన్నారు. కువైట్ లోను ముషాయిరా జరుపుతారన్నారు. అనంతరం ఆయన్ను శాలువా కప్పి సత్కరించారు.

ఎస్‌పిని కలిసిన భూపేష్‌రెడ్డి



ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ఎస్పి ఇ.జి. అశోక్ కుమార్‌ను శుక్రవారం జమ్మలమడుగు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా భూపేష్ రెడ్డి మాట్లాడుతూ శాంతి భద్రతలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. అసాంఘిక కార్యకలాపాలకు ఎక్కడికక్కడ అడ్డుకట్ట వేసి జిల్లాను ప్రశాంత వాతావరణంలో ఉంచాలని కోరారు. అనంతరం ఎస్‌పిని సన్మానించారు.

ఆర్‌టిసికి రూ.73 లక్షలు ఆదాయం

ప్రజాశక్తి - కడప అర్బన్ : శివరాత్రి సందర్భంగా జిల్లాలోని వివిధ డిపోల నుంచి శైవ క్షేత్రాలకు ఆర్‌టిసి బస్సులను నడపడం ద్వారా రూ.73,97,613 ఆదాయం వచ్చినట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి గోపాల్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్‌టిసిని ఆదరించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. గంగమ్మ జాతరకు ప్రత్యేక బస్సులు వేశామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

'ఆకేపాటి' ఎస్టేట్ ఆక్రమణలు రద్దు

38 ఎకరాలు స్వాధీనానికి ఆదేశాలు

కోర్టును ఆశ్రయించే యోచనలోఎమ్మెల్యే

ప్రజాశక్తి-కడప ప్రతినిధి/రాయచోటి



ఆకేపాటి ఎస్టేట్ ఆక్రమణలను స్వాధీనం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. నెలన్నర రోజుల కిందట నుంచి కొనసాగుతున్న ఆకేపాటి ఎస్టేట్ ఆక్రమణల వ్యవహారం కొనసాగుతోంది. ఆకేపాటి ఎస్టేట్ ఆక్రమణలపై రాజంపేటకు చెందిన టిడిపి నాయకులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఫిర్యాదు చేయడంతో ఆక్రమణల తేనెతుట్టే కదిలింది. జిల్లా రెవెన్యూ యంత్రాంగం ఆక్రమణ భూములను సర్వే చేసి, రెవెన్యూ రికార్డులను పరిశీలన చేసింది. అనంతరం జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో ఆకేపాటి ఎస్టేట్ భూముల రికార్డులకు సంబంధించిన ఆధారాలను అందజేయాలని ఆదేశించారు. స్పందించిన రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి తన న్యాయవాది ద్వారా ఆకేపాటి, మందరం, శేషమాంబపురం, తదితర గ్రామాల పరిధిలోని తన కుటుంబ సభ్యుల పేరిట ఉన్న 814.3, 814.4, 815.1, 815.2, 816.2, 56.8, 56.9 తదితర సర్వే నెంబర్లు కలిగిన భూముల రికార్డులను అందజేశారు. సుదీర్ఘ పరిశీలన చేసిన అనంతరం 28 ఎకరాల ఆమ్రణలన్ని గుర్తించి రద్దు చేయడానికి మొగ్గు చూపించారు. తన కుటుంబ సభ్యుల పేరిట ఉన్న భూముల్లో కొన్నింటిని ఆయన భార్య, కుటుంబ సభ్యుల పేరిట ఉన్న భూముల వివరాలను వెబ్‌ల్యాండ్‌లో మార్పులు, చేర్పులు చేసినట్లు గుర్తించినట్లు సమాచారం. వీటిని గుర్తించిన రెవెన్యూ కోర్టు ఆక్రమణ భూములను స్వాధీనం చేసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి ఎస్టేట్ భూముల స్వాధీనాన్ని నిలువరించాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించే ఆలోచనల్లో ఉన్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.

ఆర్థికాభివృద్ధికి సహకారం : కలెక్టర్

ప్రజాశక్తి - కడప : జిల్లాలో సహకార సంఘాలను బలోపేతం చేసి స్వయం సహాయక సంఘాల ఆర్థికాభివృద్ధికి సహకారం అందించాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాల్‌లో జిల్లా సహకార అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సహకార సంఘాలను బలోపేతం చేసి స్వయం సహాయక సంఘాల ఆర్థికాభివృద్ధికి సహకారం అందించాలని అన్నారు. రైతు సంఘాలకు అన్ని విధాలా ప్రోత్సాహం అందించాలన్నారు. జిల్లాలో అమలవుతున్న ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలలో కంప్యూటీకరణ గోదాముల నిర్మాణం, పెట్రోల్ బంకుల ఏర్పాటు తదితరాలపై పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. జిల్లా సహకార బ్యాంకు పనితీరు సమీక్షించి ప్రస్తుత పోటీ తత్వము బ్యాంకింగ్ వ్యవస్థలో ఆధునిక విధానాలు అందిపుచ్చుకుని వ్యాపార విస్తృతిని పెంచాలని దిశ నిర్దేశం చేశారు. తొలుత అంతర్జాతీయ సహకార సంవత్సరం 2025 పురస్కరించుకుని సందర్భంగా ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు.

వైసిపి నేతలపై చట్టపరమైన చర్యలు : టిడిపి

ప్రజాశక్తి - కడప అర్బన్ : పోసాని అరెస్టు అక్రమం అని మాట్లాడుతున్న మాజీ సిఎం జగన్, వైసిపి నేతలు సిగ్గుపడాలని, తల్లిని, చెల్లిని అని చూడకుండా ప్రతి ఒక్కరిని అసభ్య పదజాలంతో మాట్లాడిన వైసిపి నేతలపై చట్టపరమైన చర్యలు కూటమి ప్రభుత్వం తీసుకుందని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరి ప్రసాద్ అన్నారు. శుక్రవారం హరి టవర్స్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారం ఉందని సోషల్ మీడియాలో ఫొటోలు మార్ఫింగ్ చేసిన ఘనత వైసిపి నాయకులకే దక్కుతుంది అనడంలో ఎటువంటి సందేహం లేదన్నారు. సొంత చెల్లెళ్లపై ఆసభ్య పోస్టులు పెట్టించిన జగన్ కూటమి ప్రభుత్వం గురుంచి మాట్లాడే నైతిక అర్హత లేదని మండిపడ్డారు. గత ప్రభుత్వంలో దాడులకు తెగబడే సంస్కృతి నుంచి ప్రజలు బయటికి రావాలనే కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టారన్నారు.

పట్టుదల ఉంటే ఏదైనా సాధ్యం

ప్రజాశక్తి - బ్రహ్మంగారి మఠం : మనిషిలో పట్టుదల అనేది ఉంటే ఏమైనా సాధించగలడని బద్వేల్ డివిజన్ డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్ఒ డాక్టర్ మల్లేష్ కోరారు. బ్రహ్మంగారిమఠం మండలం, పలుగురాళ్లపల్లె పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ చెన్నకేశవరావ్ ఉన్నత చదువులకై వెళుతున్న సందర్భంగా ఏర్పాటుచేసిన వీడ్కోలు సమావేశంలో ఆయన మాట్లాడుతూ డాక్టర్ చెన్నకేశవరావ్ విధులు నిర్వహిస్తూ ఉన్నత చదువులకు ఎంపిక కావడం సంతోషదాయకమన్నారు. పీజీ కోర్సుల్లో రేడియాలజీ డిపార్ట్‌మెంట్ రావడం అనేది చాలా గొప్ప విషయం అన్నారు. అనంతరం అతిథులు చెన్నకేశవరావును పూలమాలలతో, ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ సంపత్ కుమార్, డాక్టర్ జోత్స్న, టేకురుపేట, బి.కోడూరు, బద్వేలు పిహెచ్‌సి వైద్యులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్యతోనే ఉన్నత స్థానం

ప్రజాశక్తి - బద్వేలు



విద్యార్థులతో మాదన విజయ్‌కుమార్

ప్రతి విద్యార్థికీ క్రమశిక్షణతో కూడిన విద్యతోనే ఉన్నత స్థానం లభిస్తుందని బద్వేలు ఎంఇఒలు ఎన్ .చెన్నయ్య, డి.ప్రమీల పేర్కొన్నారు. శుక్రవారం బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని చిన్నకేశంపల్లె ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఏకాగ్రతతో చదువుపై దృష్టి పెట్టాలని, చదువుతోనే ఏదైనా సాధించవచ్చని చెప్పారు. మనిషి మనుగడకు చదువు సంస్కారం ఎంతో అవసరమని సూచించారు. కొద్ది రోజుల్లో పదవ తరగతి పరీక్షలు ప్రారంభం అవుతాయని విద్యార్థులు చదవడం, రాయడం పై దృష్టి పెట్టాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.పెంచలయ్య మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొవాలని, అందుకు తగ్గట్టుగానే తన ఆలోచన, తపన ఉండాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో స్టాఫ్ సెక్రటరీ, తెలుగు ఉపాధ్యాయులు మాదన విజయ కుమార్, టేకూరుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎ.వి.రమణయ్య, ఉపాధ్యాయులు టి.వి.సుబ్బారావు, పి.సుబ్బరాయుడు, ఎస్.వరలక్ష్మి, ఎస్.గౌస్ బాషా, వై.రామ మోహన్, డి.ఇందిర, ఎం.నరేష్, పి.సుబ్రహ్మణ్యం, ఆర్.వెంకటసుబ్బయ్య పి.చక్రపాణి, రమణారెడ్డి, మెర్సీ పాల్, హరిప్రియ, మనోరమ, విద్యా కమిటీ చైర్మన్ రాజేశ్వరి పాల్గొన్నారు. **విద్యార్థులకు విద్యా సామాగ్రి పంపిణీ** ..విద్యార్థులకు తెలుగు ఉపాధ్యాయులు మాదన విజయ కుమార్ విద్యాసామాగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొద్ది రోజుల్లో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం అవుతాయని, విద్యార్థులందరూ ఒత్తిడికి గురి కాకుండా పరీక్షలు రాయాలన్నారు. క్రమశిక్షణ తో కూడిన విద్య తోనే భవిష్యత్తు లో ఉన్నత స్థానానికి చేరుకుంటారన్నారు.

దీర్ఘకాలిక నొప్పులకు ప్రత్యేక చికిత్సలు

ప్రముఖ న్యూరో వైద్యులు డాక్టర్ జగదీశ్వర్‌రెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్



మాట్లాడుతున్న డాక్టర్ జగదీశ్వర్‌రెడ్డి

నగరంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో ఉన్న జగదీష్ న్యూరో కేర్‌లో దీర్ఘకాలిక నొప్పులకు ప్రత్యేక చికిత్సలు అందుబాటులో ఉన్నాయని, పక్షవాతం వచ్చిన వెంటనే రెండు మూడు గంటల్లో నివారించేందుకు ఎమర్జెన్సీ ఇంజక్షన్ త్రంబో లైసిన్ అందుబాటులో ఉందని ప్రముఖ న్యూరో వైద్యులు డాక్టర్ జగదీశ్వర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం జగదీష్ న్యూరో కేర్ 12వ వార్షికోత్సవం సందర్భంగా విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతోమంది రక్తం అందక ఇబ్బందులు పడుతూ ఉన్నారని, అలాంటి వారి కోసం వార్షికోత్సవం పురస్కరించుకొని తమ సిబ్బంది, పారా మెడికల్ కలసి 30 మంది రక్తదానం చేశారని పేర్కొన్నారు. ఎమర్జెన్సీ యాక్సిడెంట్ కేసుల్లో జగదీష్ న్యూరో కేర్‌లో అత్యుత్తమ చికిత్స అందుబాటులో ఉందని తెలిపారు. సిటీ స్కాన్, రేడియాలజిస్ట్ వైద్య సేవలు ఆసుపత్రిలో అందుబాటులో ఉండడం వల్ల రోగికి వెంటనే చికిత్స అందుతుందని చెప్పారు. 24 గంటలు అత్యవసర కేసులను చూస్తామని పేర్కొన్నారు. మెరుగైన సేవలు నిరంతరం అందించడానికి ఐసివి స్పెషలిస్ట్ డాక్టర్ హర్షవర్ధన్ రెడ్డి, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ క్రాంతి రెడ్డి తోపాటు నిపుణులైన వైద్య సిబ్బంది అందుబాటులో ఉన్నారని తెలిపారు. పక్షవాతంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు కరపత్రాలను పంపిణీ చేస్తున్నామని, పోర్డింగులు ఏర్పాటు చేస్తున్నామని తెలియజేశారు.

అధికారుల తీరు మారకపోతే ఆందోళన

ప్రజాశక్తి- కడప అర్బన్ : నగర సంస్థ అధికారులు కార్మికుల పట్ల నిర్లక్ష్య వైఖరి, అవ మానకరం మాటలు మితిమీరిపోయి ఉన్నాయని, తీరు మారకపోతే ఆందోళన తప్పదని ఎపి మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షులు కంచుపాటి తిరుపాల్ హెచ్చరించారు. శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 5 గంటలకే మస్టరుకు రావాలని చెప్పడం, ఆరున్నరకే మెయిన్ రోడ్స్ క్లియర్ కావాలని చెప్పడం, రిటన్ మస్టర్ కొనసాగించడం, మహిళ కార్మికులచే కాలవ కుప్పల ఎత్తించడం, సెక్రటరీలు ఇతర ఇన్‌స్పెక్టర్లు ఎవరి ఇష్టానుసారంగా వారు కార్మికుల పట్ల దుర్భాషలాడే సంఘటనలు తరచూ చోటు చేసుకుంటున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో, జిల్లాలో ఎక్కడా లేనివిధంగా రిటర్న్ మస్టర్లు, టైమింగ్‌లు ఈ అధికారులు కొనసాగిస్తున్నారని తెలిపారు. ధర్నా కార్యక్రమం తర్వాత అధికారుల తీరు మారకపోతే పెద్ద ఎత్తున ఆందోళన బాట పట్టక తప్పదని హెచ్చరించారు. ఇందుకు పూర్తి బాధ్యత నగరపాలక సంస్థ అధికారులదే అన్నారు. ఈ నెల 3న ధర్నా నిర్వహించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ధర్నాకు కార్మికులందరూ సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నగర అధ్యక్షులు సుంకర రవి, ఉపాధ్యక్షులు ఇత్తడి ప్రకాష్, సుంకర కిరణ్, మహిళలు పాల్గొన్నారు.

జానమద్ది' ఆశయాలకు అనుగుణంగా

బ్రౌన్ గ్రంథాలయం అభివృద్ధి : విసి

ప్రజాశక్తి - కడప అర్బన్



జానుమద్ది చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న అతిథులు

డాక్టర్ జానమద్ది హను మచ్ఛాస్త్రి ఆశయాలకు అనుగుణంగా సి.పి. బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రాన్ని సర్వతో ముఖంగా అభివృద్ధి చేస్తామని యోగి వేమన విశ్వవిద్యాలయ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.రఘునాథ రెడ్డి అన్నారు. శుక్రవారం యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం బ్రౌన్‌శాస్త్రి సమావేశ మందిరంలో సి.పి.బ్రౌన్ స్మారక గ్రంథాలయ నిర్మాత డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి 11వ వర్ధంతిని, స్మారకోపన్యాసాన్ని నిర్వహించింది. కార్యక్రమంలో ముందుగా అతిథులంతా కలసి డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులర్పించారు. సభాధ్యక్షులు, యోగి వేమన విశ్వవిద్యాలయ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఇతర ప్రాంతాల నుండి కడపకు ఎవరన్నా ప్రముఖులు వస్తున్నారంటే 'సి.పి.బ్రౌన్ గ్రంథాలయాన్ని', 'జానమద్ది హనుమచ్ఛాస్త్రి'ని చూడకుండా తిరిగి వెళ్ళేవారు కాదంటే, గ్రంథాలయ ప్రశస్తి, జానమద్ది కీర్తి ఏ స్థాయిదో ఊహించవచ్చన్నారు. ఆయన 'కడపజిల్లా రచయితల సంఘం' కార్యదర్శిగా, అధ్యక్షులుగా జిల్లాలోని అధికారులతో, సాహితీమిత్రులతో కలసి అనేక సాహిత్య కార్యక్రమాలు నిర్వహించారన్నారు. గౌరవ అతిథి, సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సలహామండలి సభ్యులు జానమద్ది విజయభాస్కర్ మాట్లాడుతూ బ్రౌన్ తెలుగు భాషా సాహిత్యాలకు సేవ చేస్తున్న సందర్భంలో ఈస్టిండియా కంపెనీ ఆయనను మతేతర కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్నందుకు ఉద్యోగం నుంచి తొలగిస్తామని హెచ్చరించినప్పటికీ లెక్కసేయక తాననుకున్నది సాధించి చిరకీర్తులయ్యారని చెప్పారు. ఆత్మీయ అతిథి, మొల్ల సాహిత్య పీఠం అధ్యక్షులు విద్వాన్ గానుగపెంట హనుమంతరావు మాట్లాడుతూ హనుమచ్ఛాస్త్రి నిజాయితీ, నిబద్ధతలకు నిలువెత్తు రూపమని, బద్వేలుకు పలుమార్లు ఆహ్వానించి ఆయనతో కలసి నిర్వహించిన కార్యక్రమాలను సభ దృష్టికి తెచ్చారు. వేదికపై ఉన్న అతిథులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, డాక్టర్ చింతకుంట శివారెడ్డి సభను పర్యవేక్షించారు.


అధికారులతో మాట్లాడుతున్న జెసి అదితి సింగ్

రేషన్ సరఫరాలో అలసత్వం తగదు : జెసి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

రేషన్ బియ్యం సరఫరాలో అలసత్వం తగదని జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని సివిల్ సప్లయ్ గోడౌన్ ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పులివెందుల పట్టణంలో రేషన్ బియ్యం సరఫరాలో అలసత్వం వహిస్తున్నారని తమ దృష్టికి వచ్చిందని ఇందులో భాగంగా తనిఖీ చేస్తున్నామని చెప్పారు. ఎన్‌యుడి వాహనం ద్వారా ఇంటింటి పట్టణంలో రేషన్ బియ్యం సరఫరా చేయలేదని ఆమె దృష్టికి తీసుకువెళ్లగా ఎందుకు ఇంటింటికి సరఫరా చేయలేదని అధికారులను ప్రశ్నించారు. సోమవారం నుంచి ఎంయుడి వాహనాల ద్వారా సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ఈ విషయమై విచారించి చేసి చర్యలు తీసుకుంటామన్నారు. రేషన్ బియ్యం, చక్కెర నిల్వల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ చెన్నయ్య, తహశీల్దార్ నజీర్ మహమ్మద్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహశీల్దార్ సుధీర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు సంతృప్తికరంగా పరిష్కరించాలి

సింహాద్రిపురం: అర్జీదారుల సమస్యలు సంతృప్తికరంగా పరిష్కరించాలని జెసి అదితి సింగ్ సూచించారు . శుక్రవారం మండల కేంద్రమైన సింహాద్రిపురం లోని తహశీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ సదస్సులలో వచ్చిన అర్జీలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులలో ఇచ్చిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం ఎంతో ఉన్నత ఆశయంతో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. ఇచ్చిన ప్రతి అర్జీని క్షేత్రస్థాయిలో పరిశీలించి వారు సంతృప్తి చెందేలా పరిష్కరించాలన్నారు. లేకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవిన్యూ సదస్సులలో వచ్చిన అర్జీలకు సంబంధించి గ్రామ రెవెన్యూ అధికారులు తయారు చేసిన రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో పులివెందుల ఆర్‌డిఒ చిన్నయ్య, డిఐ హేమలత, తహశీల్దార్ నాగేశ్వరరావు, డిప్యూటీ తహశీల్దార్ శ్రీహరిబాబు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి - ముద్దనూరు : కంది పంట సాగు చేసిన రైతులు కందులను మద్దతు ధరకు అమ్ముకునేందుకు ప్రభుత్వ నిబంధనలను పాటించాలని వ్యవసాయ అధికారి వెంకట కృష్ణారెడ్డి సూచించారు. తిమ్మాపురం గ్రామంలోని కందుల కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం పరిశీలించారు. కొనుగోలు కేంద్రంలో తేమ శాతం కొలిచే (డిజిటల్ మాయిశ్చరైజింగ్ మీటర్) పరికరాన్ని సంచులకు వేసే ట్యాగ్‌లు పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కందులు ప్రభుత్వ మద్దతు ధర రూ 7,550 అమ్ముకోవడానికి రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ప్రభుత్వ నిబంధనలను అనుసరించి రైతుల నుండి కందులను కొనుగోలు చేయాలని ఏజెన్సీ అధికారులకు సూచించారు .కందులు అమ్మకానికి దళారులను,మధ్య వర్తులను నమ్మరాదని రైతులను కోరారు.

శిల్పారామాన్ని అభివృద్ధి చేస్తాం

- రాష్ట్ర ప్రధాన పరిపాలనాధికారి

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప శిల్పారామాన్ని శుక్రవారం రాష్ట్ర శిల్పారామముల ప్రధాన పరిపాలన అధికారి వి. స్వామి నాయుడు సందర్శించారు. బోటింగ్, ఐలాండ్ చుట్టూ పూల మొక్కలను, పబ్లిక్ కూర్చోవడానికి సిమెంట్ బెంచ్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. బోటింగ్ స్థితిగతులను కడప శిల్పారామం పరిపాలన అధికారిని పి.శివ ప్రసాద్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. బోటింగ్ పాండ్, స్కల్చర్ పార్కు, పార్కింగ్ గేమ్, జోన్ ఏరియాను సందర్శించి కొన్ని సూచనలు చేశారు. మెయిన్ గేట్ ఎంట్రన్స్ నుంచి మినీ థియేటర్ వరకు రోడ్డుకు ఇరువైపులా పూల మొక్కలు నాటి వాటర్ డ్రిప్ సిస్టం ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. అందుకు అవసరమైన ఫండ్స్‌ను ఇస్తామని తెలిపారు. గతంలో కన్నా కడప శిల్పరామం బాగుందని, మరింతగా అభివృద్ధి చేస్తామని చెప్పారు.

పులివెందుల టౌన్ : శిల్పారామం, ఉలిమెల్ల లేక్‌లలో పచ్చదనం పరిశుభ్రతను పాటించాలని శిల్పారామం సిఇఒ వి. స్వామి నాయుడు అన్నారు. శుక్రవారం శిల్పారామం, పులివెందుల, ఉలిమెల్ల లేక్ సందర్శించారు. అలాగే ఉలిమెల్ల లేక్‌లో సందర్శకుల కోసం ఉచిత రక్షిత తాగునీరు, అలాగే టికెట్ కౌంటర్‌లో భారీ గేట్ ఏర్పాటు చేయాలన్నారు. తాత్కాలిక సిబ్బందికి వారానికి ఒక సెలవు మంజూరు చేశారు. ఆదివారం, పండుగ రోజులలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో శిల్పారామం పరిపాలన అధికారి సుధాకర్, ఎఇ వెంకటసుబ్బయ్య, ఫీల్డ్ సూపర్‌వైజర్లు ఇస్మాయిల్, సాహెబ్, సుబ్బారావు, ఉలిమెల్ల లేక్ సూపర్‌వైజర్ వరప్రసాద్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

శిల్పారామం అధికారులకు సూచనలు ఇస్తున్న సీఈవో

తేలికపాటి తడులను ఇవ్వాలి

ప్రజాశక్తి -చక్రాయపేట : మామిడి పూత తోటలకు తేలికపాటి తడులను ఇవ్వాలని కెవికె శాస్త్రవేత్త మానస పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని సురభి పంచాయతీ రెడ్డివారిపల్లి గ్రామంలో మామిడిలో చేపట్టాల్సిన సస్యరక్షణ గురించి శిక్షణ కార్యక్రమం మండల ఉద్యానవన అధికారి రెడ్డయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి కెవికె ఉద్యాన శాస్త్రవేత్త మానస ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మామిడి పూత విచుకు నృపటినుంచి తేలికపాటి తడులతో ప్రారంభించి నీటిని ఇవ్వాలన్నారు. పిందె కట్టిన దశలో, రెండవ దఫా సిఫారసు చేసిన ఎరువులను వేసుకోవాలన్నారు . తేనె మంచు పురుగు నివారణకు వ్యవసాయాధికారులు సూచించిన మందులను వాడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సురభి మాజీ సింగల్ విండో అధ్యక్షుడు నాగిరెడ్డి, మండల వ్యవసాయ అధికారి నవంత్ బాబు, హార్టికల్చర్ అసిస్టెంట్లు వినోద్, సురేఖ, రైతులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

అత్యాచారం కేసులో ముద్దాయికి జైలు శిక్ష

ప్రజాశక్తి - వేంపల్లె : అలిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన కొమ్మద్ది గంగయ్య భార్యపై జరిగిన అత్యారాచం కేసులో గొల్లపల్లి శివ నారాయణ అనే ముద్దాయికి 3 సంవత్సరాలు జైలు శిక్షతో పాటు రూ .10 వేలు జరిమానా విధించినట్లు ఎస్ఐ తిరుపాల్ నాయక్ తెలిపారు. 2023 జూన్ నెలలో కొమ్మద్ది గంగయ్య పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎస్ఐ తిరుపాల్ నాయక్ తెలిపిన వివరాల.. గంగయ్య కూలి పని వెళ్లాడు. అతని భార్యకు మతిస్థిమితం సరిగా లేదు. మాట్లాడలేని సమయంలో అదే గ్రామానికి చెందిన శివ నారాయణ మధ్యాహ్నం సమయంలో ఇంట్లో ఒంటరిగా ఉన్న ఆమెపై అత్యాచారం చేశాడు. విషయంపై కేసు నమోదు చేశారు. సదరు కేసు విషయంపై శుక్రవారం కడప మహిళ కోర్టులో విచారణ జరగక సాక్షులు చెప్పిన నిజ నిరూపణ కావడంతో ముద్దాయి శివ నారాయణకు జైలు శిక్ష, జరిమానా విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

బైక్ దొంగ అరెస్టు

ప్రజాశక్తి- కడప అర్బన్

మోటార్ బైక్ మెకానిక్ ముసుగులో పదుల సంఖ్యలో మోటార్ వాహనాలను దొంగలించిన నిందితుడిని వన్ టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి సుమారు రూ.8 లక్షలు విలువ చేసే 18 మోటార్ వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం మీడియా సమావేశంలో సిఐ రామకృష్ణ, ఎస్ఐ అమర్నాథరెడ్డి వివరాలు వెల్లడించారు. వేల్పుల నరేంద్ర అలియాస్ మహేంద్ర రవీంద్ర నగర్‌లో మోటార్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడని తెలిపారు. ఈ ఏడాది జనవరిలో హోండా షైన్, హెూండా ఆక్టివ్, మోటార్ వాహనాలు దొంగతనానికి గురి అయినట్లు బాధితుల నుంచి ఫిర్యాదులు అందాయని పేర్కొన్నారు. కేసులు నమోదు చేసి పోలీసులతో ఒక టీం ఏర్పాటు చేశామని చెప్పారు. 20 రోజుల నుంచి నగరంలో నిఘా పెట్టామని పేర్కొన్నారు. రవీంద్ర నగర్‌లో ఉన్న మోటార్ మెకానిక్ నరేంద్ర దొంగతనం చేసినట్లు ఒక నిర్ధారణకు వచ్చామని తెలిపారు. ఇన్‌ఫార్మర్ ద్వారా వచ్చిన సమాచారం మేరకు రవీంద్ర నగర్ వద్ద నిందితుడు నరేంద్రను అరెస్ట్ చేసినట్లు చెప్పారు. బైకు దొంగను అరెస్టు చేయడంలో చొరవ చూపిన బాలచంద్ర రాజు, కిరణ్ కుమార్, చంద్ర నారాయణరెడ్డిని సిఐ అభినందించారు.

గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదగాలి : డిఇఒ


కడప : వికాస్ పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రదర్శనను పరిశీలిస్తున్న డిఇఒ

ప్రజాశక్తి - కడప

విద్యార్థులు సర్ సివి రామన్‌ను ఆదర్శంగా తీసుకొని గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదగాలని డిఇఒ షేక్ శంషుద్దీన్ అన్నారు.కడప నగరం స్థానిక అక్కయ్య పల్లెలో వికాస్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో నేషనల్ సైన్స్ డే సందర్భంగా శుక్రవారం ఏర్పాటుచేసిన సర్ సివి రామన్ సైన్స్ ఎక్స్‌పోను ఆయన సందర్శించారు. స్కూల్లో ఏర్పాటుచేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను జిల్లా విద్యాధికారి, స్కూల్ కరెస్పాండెంట్ వికాస్ హరికృష్ణతో కలిసి రిబ్బన్ కట్ చేసి సైన్స్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఇఒ మాట్లాడుతూ విద్యార్థులు 200 ప్రాజెక్ట్ తయారు చేయడం చాలా గొప్ప విషయమని అన్నారు. అలాగేసర్ సివి రామన్ భారతదేశం గర్వించదగ్గ శాస్త్రవేత్త అని పేర్కొన్నారు. విద్యార్థులు గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో ఎంఇఒ గంగిరెడ్డి, ఉమెన్ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ వి సలీంబాషా, ఎస్‌పి ఇంజినీర్ కళాశాల ప్రిన్సిపల్ వీర సుదర్శన్ రెడ్డి, సహదేవ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. హెచ్‌ఎం హమీద్, ప్రిన్సిపల్ ఫాతిమా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మూఢనమ్మకాలను వదిలి శాస్త్రీయ విజ్ఞానంతో మెలగాలని కడప ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి. రవీంద్రనాథ్ అన్నారు. శుక్రవారం ప్రభుత్వ పురుషుల కళాశాల (స్వయం ప్రతిపత్తి) కడప సైన్స్ డిపార్ట్‌మెంట్‌లు, ఎన్ఎస్ఎస్ విభాగం, జన విజ్ఞాన వేదిక సంయుక్తంగా జాతీయ సైన్స్ డే కార్యక్రమాన్ని కళాశాలలో ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి రవీంద్రనాథ్, కార్యక్రమ ముఖ్య అతిథులుగా విచ్చేసిన డాక్టర్ బ్రహ్మారెడ్డి జన విజ్ఞాన వేదిక స్థాపకులు, డాక్టర్ ఎన్ వెంకట్రామిరెడ్డి ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ యోగి వేమన యూనివర్సిటీ సర్ సివి రామన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం అతిథులను ప్రిన్సిపల్ శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం రమేష్, సైన్స్ డిపార్ట్‌మెంట్ ఇన్‌చార్జులు కళాశాల అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

అగ్రగణ్యుడు సర్ సివి రామన్..

ఆధునిక భారతీయ విజ్ఞాన శాస్త్రవేత్తల పరిశోధన ప్రతిభను అంతర్జాతీయస్థాయిలో ఇనుమడింపచేసిన వ్యక్తుల్లో సర్ సి.వి. రామన్ అగ్రగణ్యుడని స్టెప్ సిఇఒ సి. సాయి గ్రేస్ అన్నారు. జిల్లా యువజన సర్వీసుల శాఖ(స్టెప్)ఆధ్వర్యంలో శుక్రవారం మున్సిపల్ హై స్కూల్ మెయిన్‌లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. సివి రామన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగమణి, స్టెప్ మేనేజర్ వి.వి. సుబ్బరాయుడు, సిబ్బంది టి. నాగయ్య, వి.వి. నారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.


జమ్మలమడుగు రూరల్ : ప్రయోగాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

కడప అర్బన్ : ప్రతి విద్యార్థి చిన్నప్పటి నుంచే సైన్స్ పట్ల ఆసక్తి కలిగి ఉన్నప్పుడు కొత్త కొత్త ఆవిష్కరణలు రూపొందుతాయని చిన్నచౌకు ఎస్ఐ రాజారాజేశ్వర రెడ్డి అన్నారు. శుక్రవారం నగర శివార్లలోని ఢిల్లీ పబ్లిక్ స్కూలులో సైన్స్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎస్ఐ మాట్లాడుతూ ప్రస్తుతం సైన్స్ అండ్ టెక్నాలజీ బాగా అభివృద్ధి చెందిందన్నారు. భారతరత్న, భౌతికశాస్త్రంలో నోబెల్ బహుమతి పొందిన మన దేశ దార్శనికుడు సర్ సి.వి రామన్‌ను స్మరించుకుంటూ సైన్స్ విలువను ప్రపంచానికి, విద్యార్థి లోకానికి తెలి యజేయడమే ఈ దినోత్సవ ప్రత్యేకత అన్నారు. చిన్నారులు రామన్‌ను స్ఫూర్తిగా తీసుకుని భవిష్యత్తులో సైంటిస్టులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. పాఠశాల విద్యార్థులు వినూత్నంగా ఆలోచించి వివిధ ప్రదర్శలు ఏర్పాటు చేయ డమేకాకుండా వాటి విశిష్ఠతలను వివరించడాన్ని అభినందించారు. ఇలాంటి కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్న పాఠశాల యాజమాన్యం తీరును ప్రశంసించారు. అనంతరం ముఖ్య అతిథిని పాఠశాల ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

వేంపల్లె : జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం వేంపల్లెలోని శ్రీ చైతన్య, శ్రీనివాస, నారాయణ, ఉషాకిరణ్, ఉర్దూ హైస్కూల్లో విజ్ఞాన మేళాను నిర్వహించారు. ఆయా పాఠశాలలో విజ్ఞాన మేళా నిర్వహించడంతో ఉత్సహ భరితంగా విద్యార్థులు ఆయా ప్రయోగాలు చేపట్టి ప్రదర్శనలో పెట్టారు. ప్రదర్శనలో పర్యావరణ పరిరక్షణ, సౌర శక్తి, విద్యుత్ ఉత్పత్తి, రోబోటిక్స్, జల సంరక్షణ, ఆరోగ్య శాస్త్రం, భౌతికశాస్త్ర ప్రయోగాలు, భూగర్భ విశ్లేషణ, భవిష్యత్తు టెక్నాలజీ వంటి అనేక ప్రాజెక్టులను విద్యార్థులు రూపొందించి ప్రదర్శించారు. విద్యార్థులు తయారు చేసిన ఎగ్జిబిట్స్ ప్రదర్శనలను పరిశీలించి, వారి ప్రతిభను ఆయా పాఠశాలల కరస్పాండెంట్లు ప్రశంసించారు. ఈ ప్రదర్శన విద్యార్థుల సృజనాత్మకతను, పరిశోధనా మనస్తత్వాన్ని ప్రదర్శించే వేదికగా నిలిచిందని శ్రీచైతన్య హైస్కూల్ కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి చెప్పారు. కార్యక్రమంలో విద్యా ర్థులు, ఉపాధ్యాయులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు ఓబుల్ రెడ్డి, మలేశ్వరమ్మ, సతీష్, శ్రీనివాస హైస్కూల్ కరస్పాండెంట్ కేశవులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దేశ ప్రగతికి సైన్స్ అనేది ముఖ్యమని సైన్స్ లేకపోతే ప్రగతి అనేది ఉండదని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నోబెల్ పురస్కార గ్రహీత సివి రామన్ చిత్ర పటానికి పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి ఘనంగా నివాళ్ళర్పించారు.

శాస్త్ర విజ్ఞానంతోనే సమాజ అభివృద్ధి చెందుతుందని గంగిరెడ్డిపల్లి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సునీత పేర్కొన్నారు. వీరపునాయునిపల్లె మండలం గంగిరెడ్డిపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సైన్స్ దినోత్సవాన్ని జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవ కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివప్రసాద్ రెడ్డి, శంకర్ రెడ్డి సైన్స్ ఉపాధ్యాయురాలు రాజేశ్వరి, సునీల, విద్యార్థులు పాల్గొన్నారు.

జమ్మలమడుగు రూరల్ : నేటి విద్యార్థులు విజ్ఞాన భవిష్యత్ తరాలకు ఆదర్శం కావాలని మండల విద్యాశాఖాధికారి రమణారెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక బాలాజీ హైస్కూల్లో డైరెక్టర్ బైరెడ్డి రవీంద్రారెడ్డి అధ్యక్షతన సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంఇఒ మాట్లాడుతూ సైన్స్ పై అవగాహన ప్రతి ఒక్కరిలో ఉండాలన్నారు. సమాజ వికాసానికి విద్యార్థులలో దాగిన ప్రతిభ దోహదపడాలన్నారు. అనంతరం డైరెక్టర్ బైరెడ్డి రవీంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో సృజనాత్మక ఉంటుంది దానిని వెలికి తీయడమే ప్రధాన లక్ష్యం అన్నారు. కార్యక్రమంలో ఎఇ ప్రసాద్ రెడ్డి, హెడ్ మాస్టర్ సూర్య మిత్ర, ప్రిన్సిపల్ శిరీష, ఉపాధ్యాయులు ప్రసాద్, సత్యానందం, భరత్, సంపూర్ణ, శభాన, ముని, పుల్లయ్య, బాషా, విద్యార్థులు పాల్గొన్నారు.

చాపాడు-(మైదుకూరు): మైదుకూరు మండల పరిధిలోని సుంకులవారిపల్లి పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు నాగలక్ష్మిదేవి ఆధ్వర్యంలో సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. ఇందులో 12 పాఠశాలల నుంచి ఉపాధ్యాయులు, విద్యార్థులు వివిధ రకాల ప్రాథమిక స్థాయి సైన్స్ ప్రాజెక్టులు తయారు చేసి ప్రదర్శించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మైదుకూరు ఎంఇఒ-2 నరహరిశర్మ హాజరయ్యారు. కార్యక్రమంలో బి.కె.సురేష్, మల్లేశ్వరరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


కడప అర్బన్ : చిన్నచౌకు ఎస్ఐకి ఎగ్జిబిట్స్ గురించి వివరిస్తున్న విద్యార్థులు

పరిశోధన పట్ల యువతకు సాధికారత కల్పించాలని వైస్ ప్రిన్సిపల్ సుభాన్ సాహెబ్ పేర్కొన్నారు. మైదుకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. కళాశాలలోని విద్యార్థులకు రోల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఫర్ వికసిత్ భారత్ అనే అంశం పట్ల వ్యాసరచన పోటీలను డాక్టర్ సి నరసింహారావు నిర్వహించారు. అదే అంశం పట్ల విద్యార్థులకు ఉపన్యాస పోటీలను రసాయన శాస్త్ర అధ్యాపకులు అయ్యావారు రెడ్డి నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సుభాన్ సాహెబ్ మాట్లాడుతూ సర్ సివి రామన్ భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి పొందిన మొట్టమొదటి ఆసియా వాసి సర్ సివి రామన్ ఆవిష్కరించిన రామన్ ఎఫెక్ట్ గురించి తెలుసుకోవాలన్నారు. ప్రపంచ శ్రేయస్సుకు ఊతమిచ్చే అందరి సైన్స్ పట్ల అవగాహన పెంచడమే అసలు లక్ష్యమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ పి.వి కృష్ణారెడ్డి, డాక్టర్ నవనీశ్వర్ రెడ్డి, సీనియర్ అధ్యాపకులు సుబ్బరాయుడు, రాధా రామ్, అనురాధ, లక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

గోపవరం : శ్రీసాయి లిటిల్ కిడ్స్ పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవ సందర్భంగా సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా వైసిపి సీనియర్ నాయకులు శింగ్గ సాని గురుమోహన్ హాజరై మాట్లాడారు. చిన్న వయసులోనే సైన్స్ పట్ల మక్కువ సమాజం పట్ల అవగాహన ఏర్పడు తుందన్నారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యార్థులకు మెడల్స్‌తో పాటు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ శిరీష, ఉపాధ్యాయులు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల : శాస్త్ర విజ్ఞానంతోనే సమాజాభివృద్ధి జరుగుతుందని లెక్చరర్ సావిత్రి విద్యార్థులకు చెప్పారు. మండలంలోని చిలమకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవ కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫిబ్రవరి 28న సర్ సీవీ రామన్ 'రామన్ ఎఫెక్టు'ను కనుగొన్నట్లు ప్రకటించిన రోజు అని అన్నారు. సైన్స్ ఉపాధ్యాయులు విజయేంద్ర వాణి మాట్లాడుతూ సైన్స్ లేనిదే మానవ మనుగడ లేదని అన్నారు. మరో సైన్స్ ఉపాధ్యాయురాలు నిర్మల మాట్లాడుతూ సైన్స్ ప్రచారంలో జనవిజ్ఞాన వేదిక చేస్తున్న కృషి అభినందనీయం అని అన్నారు. 'చెకుముకి సంబరాలు' వంటి సైన్స్ కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తి కలిగించి మూఢనమ్మకాల నిర్మూలన కోసం కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు డేవిడ్ రాజు, శ్రీలత, పార్వతి, విద్యార్థులు పాల్గొన్నారు.



వేంపల్లి : ప్రదర్శనను పరిశీలిస్తున్న శ్రీచైతన్య పాఠశాల కరస్పాండెంట్

సుందరయ్య కాలనీలో రోడ్లను నిర్మించాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

కొత్తపల్లి పంచాయతీ సుందరయ్య కాలనీలో రోడ్లను నిర్మించి, మౌలిక వసతులు కల్పించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి కె.సత్యనారాయణ, ఏరియా కార్యదర్శి శేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక కొత్తపల్లి పంచాయతీ కార్యాలయం ఎదుట సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుందరయ్య నగర్ కాలనీ ఏర్పడి దాదాపు 14 సంవత్సరాలు అయిందన్నారు. ఇప్పటికీ అక్కడ ఇంకా సిమెంట్ రోడ్లు వేయని పరిస్థితి ఉందన్నారు. ప్రజలు సరైనటువంటి రోడ్డు లేక ఇబ్బందులు పడుతున్నారని, అనేకసార్లు అధికారులకు, రాజకీయ నాయకులకు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు .ప్రజలు లేని చోట్ల కూడా రోడ్లు వేస్తున్నారని, దాదాపు 250 కుటుంబాలు కలిగిన సుందరయ్యలో రోడ్డు ఏర్పాటుచేయకపోవడం బాధాకరమని వాపోయారు. కాలనీ రోడ్లు ఏర్పాటు చేయకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ కార్యదర్శి విశ్వనాథ, మహిళా సంఘం నాయకులు రాములమ్మ, శ్రీధర్, పేతురు, చెన్నమ్మ,లాల్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి

ప్రజాశక్తి-కాశినాయన : పాత పెన్షన్ విధానం అమలు చేయాలని యస్‌టియు సిపిఎస్ కమిటీ కన్వీనర్ యు.సుబ్రమణ్యం డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మెర్కర్స్ ఇండెక్స్ అనుసరించి ప్రపంచంలోనే అత్యంత మెరుగైన సామాజిక భద్రతా పథకంగా భారత పాత పెన్షన్ స్కీమ్ గుర్తింపు పొందిందన్నారు. ఈవిధానంలో ఉద్యోగి విరమణ పొందేనాటికి సర్వీసును బట్టి వేతన సవరణలను అతడు పొందే ఆర్థిక ప్రయోజనాలను సర్వీసులో చేరేటపుడు లెక్కపెట్టవచ్చన్నారు. కొత్త పెన్షన్ విధానం వల్ల ఉద్యోగి జీతం నుండి పది శాతం సొమ్ము మినహాయించి, దానికి పది లేదా కొద్ది శాతం సొమ్మును ప్రభుత్వం జమచేసి ఆ సొమ్మును వివిధ రకాల స్టాక్ మార్కెట్‌తో అనుసంధానంమైన పెన్షన్ ఫండలో పెట్టుబడిగా పెడుతుందన్నారు.

లబ్ధిదారుల ఇంటికెళ్లి పింఛను పంపిణీ చేయాలి

ప్రజాశక్తి - సింహాద్రిపురం : ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ నగదును లబ్ధిదారుల ఇంటికి వెళ్లి అందజేయాలని ఎంపిడిఒ కృష్ణమూర్తి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన సిబ్బందితో మాట్లాడుతూ లబ్ధిదారుని ఇంటికి 300 మీటర్ల కంటే ఎక్కువ దూరంలో పంపిణీ చేయకూడదని సిబ్బందికి ఆదేశించారు. మండల వ్యాప్తంగా 5143 మందికి రూ2.25 ఓట్లు పంపిణీ చేస్తారన్నారు.పెన్షన్ పంపిణీ ప్రక్రియను ఉదయం నుంచి ప్రారంభించాలన్నారు.

పంటల పరిశీలన

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు) : వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ ఎం. బాలకృష్ణ, డాక్టర్ బి.ఎన్. కాంతిశ్రీ సామూహిక ప్రథమ శ్రేణి ప్రదర్శనలో భాగంగా నూనె గింజలైన వేరుశనగ, నువ్వుల పంటలను శుక్రవారం ముదిరెడ్డిపల్లి గ్రామంలో పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేరుశనగ పంటలో కొన్ని 15 రోజులు కోత దశలో ఉండగా మరికొన్ని ఒక నెలలో నూర్పిడికి వస్తాయన్నారు. ఇనుము, జింకు లోపంతో పంట దెబ్బతిన్నట్లు గుర్తించామన్నారు. సూక్ష్మ పోషకాల మిశ్రమ ద్రావణాన్ని 3మిల్లీ లీటర్లు, 10 లీటర్ల ద్రావణంలో కలిపి పంట మీద పిచికారి చేయాలన్నారు. నువ్వుల పంట పూత దశలో ఉందని అక్క డక్కడా తెగుళ్లు ఉన్నట్లు గమనించామని చెప్పారు. కార్యక్రమంలో రాజశేఖర్ రెడ్డి, సంజీవరెడ్డి, రాంభూపాల్ రెడ్డి, బాల వీరారెడ్డి పాల్గొన్నారు.

చికెన్ వినియోగంపై అవగాహన

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : బర్డ్ ఫ్లు వ్యాధి భయంతో చాలా రోజులుగా ప్రజలు చికెన్ తినడం లేదని, ఈ నేపథ్యంలో బర్డ్ ఫ్లూపై అవగాహన కలిగించేందుకు చికెన్, గుడ్లు తినడం వల్ల ఎలాంటి అనారోగ్య సమసలు తలెత్తవని ప్రజల్లో అవగాహన కల్పించేందుకు శుక్రవారం పట్టణంలోని వ్యాపారులు బిబిఆర్ కాంప్లెక్స్ ఎదురుగా సుందరచారుల వీధిలో ఉచిత అవగాహన సదస్సు నిర్వహించారు.అనంతరం ప్రజల్లో భయం తొలగించుటకు ఉచిత చికెన్ కర్రీ ఫ్రైడ్ చికెన్ పంపిణీ చేశారు.

ప్రయాణికులకు సహరీ సౌకర్యం

ప్రజాశక్తి - వేంపల్లె : రంజాన్ మాసం పురస్కరించుకొని వాహనాల్లో వెళ్లే ముస్లిం సోదరులకు సహరీ సౌకర్యం ఏర్పాటు చేయనున్నట్లు బిలాల్ మసీదు కమిటీ సభ్యులు సభ్యుడు అబ్దుల్, ఫరూక్ పేర్కొన్నారు. శుక్రవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ వేంపల్లెలోని బిడ్డాల మిట్టలో ఉన్న బిలాల్ మసీదు ఆధ్వర్యంలో ప్రతి ఏడాది రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు ఉపవాసం ఉండేందుకు తెల్లవారుజామున మసీదు ఆవరణంలో సహరీ దావాత్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అందులో భాగంగా ఈ ఎడాదిలో కూడ రంజాన్ మాసం ప్రారంభం నుంచి సహరీ దావాత్ ను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మసీదు కమిటీ సభ్యులు మహమ్మద్, రఫీ, రిజ్వాన్, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తేవాలి

ప్రజాశక్తి - ముద్దనూరు : చెత్త సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని జమ్మలమడుగు డిఎల్‌పిఒ తిమ్మక్క కార్యదర్శులకు సూచించారు. స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని శుక్రవారం తిమ్మక్క తనిఖీ నిర్వహించి పలు రికార్డుల పరిశీలించారు. అనంతరం ముద్దనూరు, యామవరం, చిన్నదుద్యాల గ్రామాల్లోని చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో విస్తరణాధికారి వీరభద్రుడు, కార్యదర్శి లక్ష్మీ నరసింహులు పాల్గొన్నారు.

పాలిసెట్ విద్యార్థులకు ఉచిత కోచింగ్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రొద్దుటూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పదవ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు ఉచితంగా కోచింగ్ ఇస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ జింక అశోక్ బాబు ఒకప్రకటనలో తెలియజేశారు. విద్యార్థులకు అత్యుత్తమ అధ్యాపక బృందంచే ఉచితంగా కోచింగ్ ఇస్తారన్నారు. కేవలం అప్లికేషన్ ఫీజు వసూలు చేస్తారన్నారు. ఎస్‌సి, ఎస్‌టిలు రూ. 100, బిసి, ఓసి విద్యార్థులకు రూ.400 చెల్లించాలన్నారు. ఇతర వివరాలకు కొర్రపాడు రోడ్డులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల కళాశాల ప్రిన్సిపల్‌ను సంప్రదించాలన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి - వల్లూరు



విద్యాసామగ్రిని పంపిణీ చేస్తున్న తహశీల్దార్

కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయంలో ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థినులకు విద్యాసామగ్రి పంపిణీ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో రేపటి మార్పు కోసం మనమందరం కృషి చేస్తాం సంస్థ చైర్మన్ వంకదారి ఆంజనేయులు ఆధ్వర్యంలో వల్లూరు తహశీల్దార్ శ్రీ వాణి విద్యాసామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ఇంటర్ పరీక్షలకు హాజరయ్యే వారికి సామగ్రి అందించడం అభినందనీయమన్నారు. ఇలాంటి కార్యక్ర మాలు మరెన్నో చేయాలని అన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ ఆకేటి. వెంకట్ కుమార్, పెడబల్లి నరసింహ రెడ్డి, సందీప్, హరి ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'కూటమి'కి భయం పట్టుకుంది

ప్రజాశక్తి - వేంపల్లె

వైసిపి అధినేత వైఎస్ జగన్ రెడ్డిని చూసి కూటమి ప్రభుత్వానికి భయం పట్టుకుందని వైసిపి సోషల్ మీడియా మండల కన్వీనర్ రహంతుల్లా ఖాన్ పేర్కొన్నారు. శుక్రవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతిపక్ష హోదా ఇవ్వాలంటే కూటమి ప్రభుత్వం జంకుతున్నట్లు చెప్పారు. గ్రూప్-2 అభ్యర్థులను సిఎం చంద్రబాబు దారుణంగా మోసం చేశారని తెలిపారు. చంద్రబాబు ఫోన్ రికార్డ్‌తో ఆడియో రిలీజ్ చేసి గ్రూప్-2 పరీక్ష విషయంలో డ్రామా ఆడడం శోచనీయం అన్నారు. డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, బాలకృష్ణ కంటే సిఎం చంద్రబాబు మహా నటుడని చెప్పారు. సూపర్ సిక్స్ అమలు చేస్తున్నట్లు గవర్నర్ చెప్పడం హాస్యాస్పదమని చెప్పారు.

నేడు 'అక్షరసాగరం' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి- ఖాజీపేట

స్థానిక మైదుకూరు రోడ్డులోని టిటిడి కల్యాణ మందిరంలో అక్షర సాగరం పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించనున్నటుల రచయిత డాక్టర్ తవ్వా వెంకటయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పుస్తక ఆవిష్కరణ కార్యక్రమానికి ప్రజలు తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం విశ్రాంత ప్రధాన ఉపాధ్యాయులు బత్తిన మల్లారెడ్డి జీవిత విశేష సారాంశం గురించి అన్నారు. కార్యక్రమానికి కవులు, రచయితలు పాల్గొంటారని తెలిపారు

బ్రాహ్మణులకు అవకాశం కల్పించాలి

ప్రజాశక్తి - వేంపల్లె : కూటమి ప్రభుత్వం ఎమ్మెల్సీ ఖాళీల్లో బ్రాహ్మణులకు కూడా అవకాశం కల్పించాలని బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి ప్రసాద్ రావు కోరారు. శుక్రవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉన్నప్పుడు 21మంది బ్రాహ్మణులు శాసన సభలో, శాసన మండలిలో సభ్యులుగా ఉండేవారని చెప్పారు. ఎన్నికల ఖర్చును బ్రాహ్మణులు భరించే స్థితిలో లేనందున ప్రత్యక్ష ఎన్నికల్లో ఎవరూ పోటీ చేయడం లేదన్నారు. ప్రస్తుతం మేధావి సభనైనా శాసన మండలిలో బ్రాహ్మణులు లేరని చెప్పారు. సిఎం చంద్రబాబు బ్రాహ్మణుల ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్సీగా బ్రాహ్మణులకు అవకాశం ఇవ్వాలని కోరారు.

దర్జీలను కూటమి ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రజాశక్తి - వేంపల్లె : కుట్టు మిషన్‌ను నమ్ముకొని స్వయం ఉపాధి ద్వారా కుటుంబాలను పోషించు కొంటున్న దర్జీలను కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని పిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ప్రపంచ దర్జీల దినోత్సవం సందర్భంగా స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో దర్జీలైనా నాయబ్ రసూల్ (సుప్రీం టైలర్), రత్నలనుఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దర్జీలకు చేదోడు పథకాన్ని అమలు చేయాలని కోరారు. రెడీమెడ్ దుస్తులు రావడంతో దర్జీలకు ఆదరణ తగ్గిందని చెప్పారు. చేయూత పథకాన్ని కూటమి ప్రభుత్వం నిలుపుదల చేయడం శోచనీయం అన్నారు. సబ్సిడీ ద్వారా ఆధునిక యంత్ర సామగ్రిని అందించడంతో పాటు ఉచితంగా కరెంటు సరఫరా చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో తులసి రెడ్డి సతీమణి నర్రెడ్డి అలివెలమ్మ, కాంగ్రెస్ నాయకులు సుబ్రమణ్యం, రామకృష్ణ, అమర్నాథ్ రెడ్డి, బండారు వెంకటేష్, ఉత్తన్న, బద్రి, వెంకటేష్, మహబూబ్ బాషా, రవి, రమణ, వేమా రాజా, నాగరాజు, రఫీ, వెంగయ్య, కృష్ణయ్య, మునీర్ పాల్గొన్నారు.

అధ్యయనం చేద్దాం..సమాజాన్ని మార్చుదాం

ప్రజాశక్తి - బద్వేలు : రెడ్ బుక్స్ డే కార్యక్రమం సందర్భంగా సిపిఎం కార్యాలయంలో సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో 'అధ్యయనం చేద్దాం-సమాజాన్ని మార్చుదాం' అనే పుస్తకాల అధ్యయనం చేసే కార్యక్రమంలో భాగంగా వి.ఐ లెనిన్ రచించిన రాజ్యం- విప్లవం అనే పుస్తకాన్ని శుక్రరవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి కె.శ్రీను మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారులు కమ్యూనిజాన్ని చూసి భయపడడం ప్రారంభమైందని చెప్పారు. అంతర్జాతీయంగా వామపక్షాల శక్తి రోజు రోజుకు పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు ముడియం చిన్ని, షేక్ మస్తాన్ షరీఫ్, సగిలి రాయప్ప,చెప్పలి సుబ్బరాయుడు, పసుపుల మోక్షమ్మ, గంప అనంతమ్మ, షేక్ కైరున్ బీ, శాఖ కార్యదర్శులు మూరా ప్రసాద్, ఊటుకూరు బాలమ్మ, షేక్ మస్తాన్ బీ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

ప్రజాశక్తి - వల్లూరు : వల్లూరు మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు ఆదిశేషారెడ్డి పరిశీలించారు. శుక్రవారం మండల పరిధి లోని వల్లూరు, కుమారుని పల్లె, కొప్పోలు గ్రామ పంచాయతీలలో జరుగుతున్న ఉపాధి హామీ ఫారంఫండ్, ఫీడర్ ఛానల్ పూడికతీత పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలకు పని ప్రదేశాలలో మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.